క్లుప్తంగా

కంటి పరిరక్షణపై అవగాహన



చిన కోరుమిల్లి శిబిరంలో శస్త్ర చికిత్సలు చేయించుకున్నవారు

కపిలేశ్వరపురం: నేత్రాన్ని పరిరక్షించుకునే విధానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని కోరుమిల్లి గ్రామ శివారు చిన కోరుమిల్లిలో నిర్వహించిన ఉచిత నేత్ర శుక్లం చికిత్స శిబిరం కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. లంకా విజయ, మెహర్ చంద్, బులుసు, భమ్మిడిపాటి కుటుంబ సభ్యులు, చెన్నైకు చెందిన శంకర నేత్రాలయ కంటి వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. బులుసు కనకదుర్గ, వెంకట సత్య సుబ్రహ్మణ్యశర్మ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న శిబిరంలో గురువారం 652 మందికి నేత్ర పరీక్షలు చేశారు. 102 మందికి శస్త్ర చికిత్స అవసరమని, 83 మందికి ప్రత్యేక శస్త్రచికిత్స లంక విజయ్‌మెహర్ చంద్ తెలిపారు. మరో 85 మందికి మెరుగైన పరీక్షలు నిమిత్తం చెన్నైలోని జేసీఓసీ ఆసుపత్రికి తరలించేందుకు నిర్ణయించారు. నిర్వాహకులను గ్రామస్తులు అభినందించారు.

వైద్య పరికరాలను సమకూర్చిన దాతలు



సబ్‌సెంటర్ సిబ్బందికి వైద్య పరికరాలను అందజేస్తున్న దాతలు

కపిలేశ్వరపురం: వల్లూరు గ్రామ ఆరోగ్య ఉప కేంద్రానికి గ్రామానికి చెందిన జుపాస్ ఫౌండేషన్ నిర్వాహకులు వీవీ ప్రసాద్, సత్య శ్యామల గ్లూకోమీటర్, ధర్మా మీటర్లను సమకూర్చారు. ఈ దాతలు గతంలో సబ్‌సెంటర్‌కు బీపీ ఆపరేటర్లు అందజేశారు. వారిని అచ్యుతాపురం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ సీహెచ్.గోపాలకృష్ణ, ఎంపీహెచ్‌ఎస్ శ్రీధర్, వైద్య ఆరోగ్య కార్యకర్తలు స్వర్ణలత, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఆశ కార్యకర్తలు అభినందించారు.

వాడపల్లి వెంకన్న ఆలయానికి రూ.55 వేల విరాళం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు రూ.55 వేలు విరాళంగా ఇచ్చారు. అర్తమూరుకు చెందిన వెలగల వెంకటరెడ్డి, మంగాయమ్మ దంపతులు ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనానికి రూ.30 వేలు, గోశాలకు రూ.25 వేలు విరాళాన్ని గురువారం అందజేశారు. దాతకు దేవదాయ ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ చేతుల మీదుగా స్వామివారి చిత్రపటం అందజేశారు.

రాజేంద్రప్రసాద్‌కు రాష్ట్ర స్థాయి విశిష్ట పురస్కారం

ఆత్రేయపురం: మండలంలో సీఆర్‌ఎంటీగా పనిచేస్తున్న అరిగెల రాజేంద్రప్రసాద్ కాకినాడ చేయూత సేవా స్వచ్ఛంద సంస్థ ద్వారా రాష్ట్ర స్థాయి విశిష్ట పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్‌ను ఎస్టీయూ యూనియన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ నాతిబుజ్జి ముఖ్య అతిథిగా పాల్గొని రాజేంద్రప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో వరప్రసాద్, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

రావులపాలెం: పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపేందుకు విద్యార్థులకు మూడు రోజుల పాటు కెరీర్ గైడెన్స్‌పై ఇస్తున్న ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వైస్ ప్రిన్సిపాల్ సత్యమూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కెరీర్ గైడెన్స్ సెల్ చైర్మన్ కె.రజిని ఆధ్వర్యంలో మూడో ఏడాది చదువుతున్న విద్యార్థులకు విద్య, ఉద్యోగం, భవిష్యత్తు ప్రణాళికలపై శిక్షణ అందించారు. రాజమహేంద్రవరం ఐఏసీఈ కాంపిటేటివ్ అకాడమీ సీనియర్ ట్రైనర్లు ఎం.రమేష్, ఎ.రామకృష్ణలు స్టాఫ్ సెలక్షన్, బ్యాంక్ , రైల్వే, ఇతర పోటీ పరీక్షలకు సంబంధించి అర్థమెటిక్, రీజనింగ్, ఆప్టిట్యూడ్, కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ తదితర సబ్జెక్టులపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యమూర్తి తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు సిద్ధార్థ, సుందర రామిరెడ్డి, సుభాషిణి, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు అల్పాహార కిట్ల పంపిణీ

మామిడికుదురు: ఉమ్రా యాత్రకు వెళ్తున్న ముస్లిం భక్త బృందానికి పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గురువారం అల్పాహార కిట్లను అందజేశారు. నగరం పెద పంజీషాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే సత్యనారాయణ, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పాల్గొన్నారు. 20 మంది భక్తుల బృందం ఉమ్రా యాత్రకు వెళ్తుండగా వారికి అల్పాహారం కిట్లు అందించి, యాత్ర సజావుగా సాగాలని ఆభిలాషించారు. కార్యక్రమంలో జాలెం సుబ్బారావు, ముకరం హుస్సేన్, సూదా బాబ్జి పాల్గొన్నారు.

ఇదేం దారిద్ర్యం !

- గ్రామాల్లో అధ్వానంగా పుంత రోడ్లు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



పాణింగపల్లిలో అధ్వానంగా ఉన్న పుంత రోడ్డు

కె.గంగవరం: పొలాల్లో పండిన పంటను తరలించడానికి పుంత రోడ్లు ఎంతగానో ఉపయోగపడతాయి. అలాంటి పుంత రోడ్లు అధ్వానంగా ఉండడంతో పంట ఉత్పత్తులను రోడ్డెక్కించేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. రైతులకు మేలు చేస్తామని గద్దెనెక్కిన ప్రభుత్వం గెలిచాక రైతుల ఊసే ఎత్తడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు పెట్టుబడి సాయం అందించడంతో పాటు గ్రామాల్లో పుంత రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

నియోజకవర్గంలోని ప్రజలకు ప్రధానంగా వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం రూరల్ మండలాల్లోని ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామంలోనూ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలిచేందుకు, మార్కెట్ నుంచి విత్తనాలు, వ్యవసాయ సంబంధిత వస్తువులు, ఎరువులు పొలాలకు తరలించడానికి ప్రధాన మార్గమైన పుంత రోడ్లు బాగుండాలి. కానీ పరిస్థితి దానికి భిన్నంగా ఉంది. అన్ని గ్రామాల్లోనూ పుంత రోడ్లు ఛిద్రమై అధ్వానంగా ఉన్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చినుకు పడితే...

చిన్నపాటి వర్షానికే పుంత రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. మోకాళ్ల లోతు బురదతో కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీలులేకుండా మారుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. కాగా పుంత రోడ్లు మాత్రం సైకిళ్లు కూడా వెళ్లలేని పరిస్థితిలో ఉన్నాయి. వర్షాకాలమే కాకుండా వేసవి కాలంలో కూడా పుంత రోడ్లు గోతులతో ప్రమాదరంగా ఉంటున్నాయి. పుంత రోడ్లు గోతులమయంగా మారడంతో ట్రాక్టర్లు తిరగబడుతున్నాయని రైతులు చెబుతున్నారు. పొలంలో పండిన పంటను ఇంటికి, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిచేందుకు పుంత రోడ్లపై ట్రాక్టర్లు, ఇతర వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో కూలీల సహాయంతో రోడ్లపైకి చేరుస్తున్నామని రైతులు వాపోతున్నారు. నియోజకవర్గంలో పుంత రోడ్లను రెండు దశాబ్దాల క్రితం అభివృద్ధి చేశారు. ఆ తరువాత వాటిని పట్టించుకోనకపోవడంతో అధ్వానంగా మారాయి. మార్కెట్ కమిటీలు పుంత రోడ్లను అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతి బస్తాకు మార్కెట్ కమిటీ చెస్ వసూళ్లు చేస్తున్నప్పటికీ పుంత రోడ్ల అభివృద్ధి విషయంలో పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారని రైతుల ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం పంట కోత దశకు చేరుకుంటున్న తరుణంలో పంట ఉత్పత్తులను ఏలా గట్టెక్కించాలో అని రైతులు మదనపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పుంతరోడ్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతుల కష్టాలు తీర్చాలి



కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను తీర్చాలి. పుంతరోడ్లు ఆధ్వాన్నంగా మారాయి. కనీసం సైకిల్ కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్నదాతలను ఆదుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతుల మాటే ఎత్తడం లేదు.

తోకల శ్రీను, కౌలు రైతు, తామరపల్లి

పుంత రోడ్లతో రైతులకు ప్రయోజనం



పుంత రోడ్లు మెరుగ్గా ఉంటే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. పంటను మార్కెట్‌కు తరలించేందుకు రవాణా చార్జీలు తగ్గి, పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. గత పదేళ్లుగా పుంత రోడ్లను అభివృద్ధి చేయలేదు. దీంతో ప్రస్తుతం అవి ఆధ్వాన్నంగా మారాయి.

–రెడ్డి జయరాజు, రైతు, సుందరపల్లి

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ



ప్రతిభ చూపిన రాజాను అభినందిస్తున్న ఎంపీ బోస్

రామచంద్రపురం రూరల్: జిల్లా కేంద్రం అమలాపురంలో ఇటీవల నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి పురుషుల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మండలంలోని తాళ్లపొలం గ్రామ సర్పంచ్ కట్టా గోవిందు కుమారుడు కట్టా వెంకటేష్ (రాజా) ఉత్తమ ప్రతిభ చూపాడు. 105 కేజీల కేటగిరీ సీనియర్స్ విభాగంలో రాష్ట్రంలో ద్వితీయ స్థానం సాధించి సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నాడు. ఉత్తమ ప్రతిభ చూపిన వెంకటేశ్‌ను రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అభినందించారు. కేవలం 15 రోజుల ప్రాక్టీస్‌తో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం సాధించి సిల్వర్ మెడల్ సాధించడం అభినందనీయమని ఎంపీ బోస్ కొనియాడారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకూ విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్టు రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.విజయానంద్ గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లోని కాలేరు ఫీడర్ పరిధిలోని కాలేరు, నిడసనమెట్ట, సుభద్రాపురం, అచ్యుతాపురం, వడ్లమూరు గ్రామాల విద్యుత్‌లైన్ల వెంబడి చెట్ల కొమ్మలను తొలగించే నిమిత్తం సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

నేడు, రేపు క్రీడా పోటీలు

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో శుక్రవారం, శనివారాల్లో నిర్వహించే స్కూల్ గేమ్స్ సెలక్షన్‌ను విజయవంతం చేయాలని పాఠశాల హెచ్‌ఎం ఎస్‌ఎస్‌బీ సుశీలామణి కోరారు. పాఠశాలలో గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ శుక్రవారం అండర్-14, అండర్-17 బాలుర విభాగాలకు, శనివారం అండర్-14, అండర్-17 బాలికల విభాగాలకు క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులకు రామచంద్రపురంలో జరిగే నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొనాలని కోరారు.

మాజీ కౌన్సిలర్ మల్లికార్జునరావు మృతి



మల్లికార్జునరావు (ఫైల్)

రామచంద్రపురం: పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గంపల మల్లికార్జునరావు (63) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విజయవాడలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన రెండు సార్లు మున్సిపల్ కౌన్సిలర్‌గా, ఒకసారి కో ఆప్షన్ సభ్యుడిగా ప్రజలకు సేవలందించారు. ఆయన సీనియర్ కౌన్సిలర్‌గా ఉన్న సమయంలో ప్యానెల్ చైర్మన్‌గా పని చేశారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు ట్రస్టు సభ్యుడిగా కూడా సేవలందించారు. ఆయన మృతికి పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

శిల్పి వుడయార్‌కు రేలంగి పురస్కారం



రాజమహేంద్రవరంలో శిల్పి రాజ్‌కుమార్‌ను సత్కరిస్తున్న మంత్రి దుర్గేష్ తదితరులు

కొత్తపేట: అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డి.రాజ్‌కుమార్ వుడయార్‌కు ప్రముఖ హాస్య నటుడు రేలంగి వెంకట్రామయ్య పురస్కారం లభించింది. రాజమహేంద్రవరంలో గోదావరి గట్టున నెలకొల్పిన రేలంగి కాంస్య విగ్రహాన్ని కొత్తపేటకు చెందిన శిల్పి ఆచార్య రాజ్‌కుమార్ వుడయార్ రూపొందించిన విషయం తెలిసిందే. రాజమహేంద్రవరం గౌడ, శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన ఆ విగ్రహాన్ని గురువారం రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం విగ్రహ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో విగ్రహ శిల్పి రాజ్‌కుమార్‌ను మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ తదితర ప్రముఖుల చేతుల మీదుగా రేలంగి పురస్కారంతో సత్కరించారు.

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

అంబాజీపేట: ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలని ఎంఈఓ-1 కాండ్రేగుల వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో మండల స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి అందె సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను గురువారం నిర్వహించారు. అండర్-14, 17 విభాగాల్లో మండలంలోని బాలికలకు యోగా, షటిల్, అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం కడలి సాయిరామ్ మాట్లాడుతూ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో పీడీలు కుంపట్ల ఆదిలక్ష్మి, పెచ్చెట్టి సూర్యనారాయణ, బూల చిరంజీవి, ముత్యాల పవన్‌కిషోర్, మట్టా శ్రీనివాస్, పీఈటీలు ఏవీ శ్రీనివాస్, అందె సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక



రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు

కాజులూరు: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మండలంలోని కాజులూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు ఆ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు జేమ్స్ రవిసుందర్‌కార్ తెలిపారు. పాఠశాలలో గురువారం హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో అండర్ 17 బాలికల విభాగంలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు దండంగి శ్రీవల్లి, గుబ్బల అనూష, యాళ్ల వర్షాపాల్గుణదేవి ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. వీరు ఈ నెల 29వ తేదీ నుంచి గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ కార్‌లను స్కూల్ హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి, విద్యాకమిటీ చైర్మన్ పద్దరాజు, పాఠశాల సిబ్బంది, స్థానిక నాయకులు అభినందించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



ద్రాక్షారామలో గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఓస్ సిబ్బంది

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ గ్రామ సచివాలయం వద్ద గురవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. తక్కువ ఖర్చులో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహారం తయారు చేసుకునే విధానం, బాలామృతంతో పిల్లలకు వివిధ రకాల పౌష్టికాహారం తయారీపై అంగన్‌వాడీ కార్యకర్తలు కె.సత్యభవాని, కేవీవీ లక్ష్మి, బీటీఎల్ మాణిక్యాంబ తదితరులు గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి. సూర్యావతి, పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్య సుబ్రహ్మణ్యం, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లి: గర్భవతులు సమతుల్య ఆహారం తీసుకోవాలని గోపాలపురం సీడీపీఓ కె. నాగలక్ష్మి సూచించారు. గౌరీపట్నంలో గురువారం పోషకాహార మాసోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో సీడీపీఓ నాగలక్ష్మి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, తల్లులు ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. శరీరానికి అవసరమైన పోషకాలన్ని అందేలా సమతుల్యత ఆహారం తీసుకోవాలని ఆమె తెలిపారు. అందుబాటులో ఉండే పండ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ యు.పద్మావతి, సూపర్‌వైజర్ ఎం.శశికళ, సీహెచ్‌ఓ శ్రీకృష్ణుడు, అంగన్‌వాడీ టీచర్లు ఎం.ఆర్లమ్మ, వి.కుమారి, బి.అచ్చయమ్మ, బి.సునీత, కె.సులోచన, కె.భారతి, జెడ్పీ హైస్కూలు ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.

బాలికోన్నత పాఠశాలలో స్వచ్ఛ భారత్



ప్రతిజ్ఞ చేస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

మండపేట: గాంధీ మహాత్ముని జయంతిని పురస్కరించుకుని శ్రీకారం చుట్టిన స్వచ్ఛత హీ సేవ-2024 కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పలు కార్యక్రమాలు జరుగుతున్నాయి. గురువారం స్థానిక పాలడుగు సత్యవతి బాలికోన్నత పాఠశాలలో స్వచ్ఛత హీ సేవను నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో ఎదురుగా వున్న ఖాళీ ప్రాంగణం గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపరిచారు. విద్యార్థులతో స్వచ్ఛతకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కమిషనర్ టీవీ రంగారావు, కౌన్సిలర్లు మండపల్లి రవికుమార్, పిల్లి శ్రీనివాస్, మెప్మా టీఈ అనంతలక్ష్మి, ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జి పెందుర్తి ప్రదీప్‌కుమార్, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మండపేటలో అన్నదానాలు



ప్రజలకు ప్రసాదాన్ని వడ్డన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

మండపేట: గణపతి నవరాత్ర ఉత్సవాలు ముగింపును పురస్కరించుకొని పట్టణంలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. గురువారం 15వ వార్డు ధర్మగుండం చెరువు వద్ద, 22వ వార్డులోను గణపతి అన్నదాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ధర్మగుండం వీధిలో కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఆలయంలోని సంతాన గణపతిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించి వడ్డన చేశారు. 22 వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకుడు అన్యం ప్రసాద్ ఆధ్వర్యంలో గణేశుని పేరిట నిర్వహించిన అన్నదానంలో చుట్టు పక్కల వీధుల నుంచి అధికసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ తండ్రి తాడి రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు జొన్నపల్లి సత్తిబాబు, పిఠాపురం సత్యనారాయణ, అధికారి శ్రీనివాస్, సీలం సత్తిబాబు(చిన్న), పల్లబండి సూరిబాబు, జామి రాజేష్, గున్నా గణపతి, రామాని నాగేశ్వర రావు, బల్లా నాగు, చింతల వీరబాబు పాల్గొన్నారు.

అంగరలో భారీ అన్నసంతర్పణ

కపిలేశ్వరపురం: అంగర ఆది గణపతి వినాయక నవరాత్ర ఉత్సవ శిబిరంలో గురువారం భారీ అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక చప్పిడిపాలెం సెంటర్‌లో ఏర్పాట్లు చేశారు.

అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, టేకి తదితర గ్రామాల భక్తులు సుమారు 8 వేల మంది స్వామి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పెద్దింశెట్టి సూర్యచంద్రరావు, నిర్వాహకులు చీకట్ల గంగరాజు, మేడేపల్లి కొండ, కొలనాటి సురేష్, యర్రా సుబ్బారావు, శనివారపు గోవింద్, పడాల రామకృష్ణ, రాంబాబు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

మండపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడా పోటీలకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఎంపిక చేశారు. ఏడిద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఎంపికలు జరిగాయి. ఎంఈవోలు నాయుడు రామచంద్రరావు, సోమిరెడ్డిల ఆధ్వర్యంలో మండల స్థాయి అండర్-14, అండర్-17 క్రీడలకు వివిధ ఆటల్లో నైపుణ్యం కలిగిన విద్యార్థులను ఎంపిక చేశారు. ఇందులో వాలీబాల్, కోకో, కబడ్డీ, బ్యాట్మింటన్, బాల్ బ్యాట్మింటన్, షెటిల్, యోగా, చెస్ వంటి క్రీడలకు ఎంపికలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంగర వెంకట్రాజు మాట్లాడుతూ మండలంలోని బాలుర విభాగాని సంబంధించిన ఈ ఎంపికల్లో 13 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనగా 160 మంది హాజరయ్యారని తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఎంఈవో రామచంద్రరావు తెలిపారు. తర్వాత రాయవరం జెడ్పీ పాఠశాలలో నియోజకవర్గ పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గెడా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఉండమట్ల వీర్రాజు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పర్వతిన వీర్రాజు, నియోజకవర్గ గేమ్స్ కో ఆర్డినేటర్ ఎస్ వీర్రాజు, జోన్ ప్రెసిడెంట్ సీహెచ్ కృష్ణారావు, మండల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య మెరుగుకు కృషి



అంగర పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు

కపిలేశ్వరపురం: పారిశుద్ధ్య మెరుగుకు కృషి చేయాలని డీఎల్‌డీఓ శాంతి అన్నారు. అంగరలో ఎంపీడీఓ కొండలరావు పర్యవేక్షణలో నిర్వహించిన మానవహారం కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో ప్రజలు విరివిగా పాల్గొనాలన్నారు. గ్రామంలోని ప్రధాన ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. కపిలేశ్వరపురం, నేలటూరు, పడమరఖండ్రిక, కేదారిలంక, నల్లూరు, కాలేరు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకం

రాయవరం: పంచాయతీలో జరిగే ప్రత్యేక కార్యక్రమాలను పర్యవేక్షించడానికి మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఈ మేరకు ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రాయవరం పంచాయతీకి ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈగా డి.చైతన్యకుమారి, వెదురుపాకకు ఎంఈవో-2 వై.సూర్యనారాయణ, సోమేశ్వరానికి మండల ఇంజినీరింగ్ అధికారి వి.రామనారాయణ, వి.సావరం గ్రామానికి ఎంఈవో-1 పి.రామలక్ష్మణమూర్తి, మాచవరం పంచాయతీకి డ్వాక్రా ఏపీఎం ఎండీ నాసర్‌హుస్సేన్, పసలపూడికి మండల వ్యవసాయాధికారి కె.ప్రభాకర్ నియమించారు. చెల్లూరుకు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జె.సుధారాణి, వెంటూరుకు హౌసింగ్ ఏఈ జీఎస్ఎన్ దాసు, కురకాళ్లపల్లికు మండల సర్వేయర్ కె.సుజాత, నదురుబాద గ్రామానికి ఆర్ఐ పంపన రామారావు, లొల్ల గ్రామానికి ఎన్ఆర్ఈజీఎస్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ కె.కనకతలను నియమించారు. శుక్రవారం నుంచి గ్రామ పంచాయతీల్లో జరిగే ప్రత్యేక సమావేశాల్లో వీరు ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తారన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలిలో సభ్యులుగా చేరండి

రాయవరం: రిజిస్టర్ కాబడిన భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు భవన నిర్మాణ సంక్షేమ మండలిలో సభ్యులుగా చేరాలని రాయవరం మండల కార్మిక సంక్షేమ అధికారి జి.కేశవరావు సూచించారు. రాయవరంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని షాపులు, సంస్థలు వెంటనే లైసెన్స్‌లు రెన్యువల్స్, కొత్త షాపులు, సంస్థలు రిజిస్ట్రేషన్ చేయించాలని ఆయన సూచించారు. ప్రతి షాపు కార్మికులకు వెల్ఫేర్ ఫండ్ చెల్లించాలన్నారు. భవన నిర్మాణ కార్మికునిగా నమోదు చేసుకోవాలనుకునే వారు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్, బ్యాంకు పుస్తకంజెరాక్స్ తీసుకుని కార్మిక శాఖ కార్యాలయానికి రావాలన్నారు. ఐదేళ్ల రెన్యువల్‌కు రూ.110లను చలానా ద్వారా చెల్లించాలన్నారు. అక్టోబరు 10వ తేదీ లోగా రాయవరం లేబర్ ఆఫీస్ నందు నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు.

24న ఉచిత వైద్యశిబిరం

మండపేట: ఈ నెల 24 మండపేట పట్టణంలో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు జమాతె హిస్లామీ హింద్ పట్టణ అధ్యక్షుడు అబుల్ అలా, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగభూషణం తెలిపారు. గాంధీనగర్ చిన్న మసీదు ఆవరణంలో గురువారం వారు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు.

జమాతె ఇస్లామీ హింద్, మండపేట రోటరీ క్లబ్ సంయుక్తం ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని, ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 వరకూ గాంధీనగరం మసీదు వద్ద నిర్వహిస్తున్నామని తెలిపారు.